సకల సేవల వేదిక... సచివాలయం

- 545 సేవలు అందడంపై ప్రజల సంతృప్తి
- అవినీతి రహితంగా నిర్దిష్ట వ్యవధిలో..
- వలంటీర్ వ్యవస్థతో గడప ముంగిటకే ప్రభుత్వ పాలన



కొప్పవరంలోని గ్రామ సచివాలయ భవనం

అనపర్తి: పల్లెలన్నీ సంపూర్ణంగా అభివృద్ధి చెందినప్పుడే గ్రామ స్వరాజ్యం లక్ష్యాన్ని సాధించగలమని జాతిపిత మహాత్మాగాంధీ కలలు కన్నారు. అవినీతికి, వివక్షకు తావులేని స్వచ్ఛమైన పాలన...ప్రభుత్వ సేవలు, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు సకాలంలో లబ్ధిదారులకు అందించడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గ్రామ సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేశారు. సచివాలయ వ్యవస్థ ద్వారా పాలనను పల్లె ముంగిటకు తీసుకువచ్చిన సీఎం జగన్ గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్య స్థాపనకు బాటలు వేశారు.

గతంలో ప్రతీ పనికి మండల కేంద్రాలకు..

గతంలో ప్రజలు ఒక్కో పనికి మండల కేంద్రంలో ఉన్న ఒక్కో కార్యాలయానికి తిరగాల్సిన పరిస్థితి ఉండేది. గత ప్రభుత్వ పాలనలో వృద్ధులు, వితంతువులు, వికలాంగులు సామాజిక పింఛను కోసం జన్మభూమి కమిటీలను ప్రసన్నం చేసుకోవాల్సిన దుస్థితి. వివిధ పనుల కోసం ప్రజలు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ రోజులు...వారాలు...నెలల తరబడి ప్రదక్షిణలు చేయాల్సి వచ్చేది. దళారులను ఆశ్రయించి అధికారులకు మామూళ్లు సమర్పించాల్సిందే. వీటికి చెక్ పెడుతూ సీఎం జగన్ తీసుకువచ్చిన సచివాలయాలు సకల సేవల వేదికగా నిలిచాయి.

సకాలంలో పథకాలు

గతంలో ఎక్కడి సమస్యలు అక్కడే పరిష్కారమైన దాఖలాలు లేవు. ఎటువంటి ప్రభుత్వ సేవ పొందాలన్నా నెలల తరబడి ఎదురు చూడాల్సిందే. నేడు అటువంటి పరిస్థితులు మారాయి. ప్రభుత్వ సేవలు పొందాలంటే ఎదురుచూడాల్సిన పనిలేదు. కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేదు. సచివాలయ వ్యవస్థతో ఇంటి ముంగిటే మనకు అవసరమైన అన్ని సేవలు పొందే అవకాశం కలిగింది. ప్రజలకు అవసరమైన సర్టిఫికెట్లు ఆయా గ్రామాల్లోనే అందించేలా యంత్రాంగం చర్యలు చేపట్టింది. అర్హులకు సకాలంలో సంక్షేమ పథకాలు అందించేందుకు సచివాలయ సిబ్బంది, వలంటీర్లు కృషి చేస్తున్నారు. ప్రభుత్వ సేవలు ప్రజల గడప ముంగిటకే అందించాలన్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆశయాలకు అనుగుణంగా పనిచేయడంలో గ్రామ, వార్డు సచివాలయాలు సఫలమవుతున్నాయి.

అనపర్తి మండలంలో..

మండల పరిధిలో గ్రామ సచివాలయాలు	19
గ్రామ పంచాయతీలు	11
గ్రామాలు	11
వలంటీర్ల సంఖ్య	479
సచివాలయ సిబ్బంది	141

సచివాలయ వ్యవస్థతో సుపరిపాలన

గ్రామ స్వరాజ్యానికి ఊపిరులూదిన సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజలకు పూర్తి పారదర్శకంగా సుపరిపాలన అందుతోంది. గ్రామ సచివాలయ వ్యవస్థలో భాగంగా నియమించిన వలంటీర్లు ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధులుగా సేవలందిస్తున్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలకు సంబంధించి అవినీతి రహితంగా, పూర్తి పారదర్శకంగా అర్హులను ఎంపిక చేయడంలో కీలకభూమిక పోషిస్తున్నారు. గ్రామ సచివాలయ, వలంటీర్ వ్యవస్థలతో పింఛను నుంచి ఇంటి పట్టా వరకు ఏది కావాలన్నా, పంచాయతీరాజ్, రెవెన్యూ సమస్యలు, వివిధ సర్టిఫికెట్లు, తదితర అన్ని పనులూ తమ సొంత గ్రామంలో ఉన్న సచివాలయాల ద్వారా పూర్తి అవుతుండడంతో ప్రజలు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

పథకం పేరు	లబ్ధిదారుల సంఖ్య
అమ్మఒడి	5,120
వైఎస్సార్ చేయూత	7,553
వైఎస్సార్ ఆసరా	3,933
వైఎస్సార్ సున్నా వడ్డీ (పంట రుణాలు)	2,594
వైఎస్సార్ సున్నా వడ్డీ	6,937
జగనన్న వసతి దీవెన	3,058
జగనన్న విద్యా దీవెన	5,107
రైతు భరోసా	6,249
వైఎస్సార్ పెన్షన్ కానుక	10,173
వైఎస్సార్ వాహనమిత్ర	708
జగనన్న చేదోడు	1,975
జగనన్న తోడు	1,874
వైఎస్సార్ కాపు నేస్తం	780
వైఎస్సార్ ఆరోగ్యశ్రీ	1,066
వైఎస్సార్ ఉచిత పంటల బీమా	6,954

ఆనందంగా ఉంది



గతంలో పింఛను తీసుకోవాలంటే గ్రామ పరిధిలో ఏర్పాటు చేసిన పింఛను పంపిణీ కేంద్రాలకు వెళ్లి రోజుల తరబడి వేచి చూసి పింఛను తీసుకోవాల్సిన పరిస్థితి. నేడు జగన్‌బాబు పుణ్యమా అని వలంటీరు ప్రతీ నెల ఒకటో తేదీ వేకువజామునే మా ఇంటి తలుపు తట్టి పింఛను అందిస్తున్నారు. చాలా ఆనందంగా ఉంది.

– కోరుకొండ భూలక్ష్మి, అనపర్తి

వారం రోజుల్లోనే ఫ్యామిలీ సర్టిఫికెట్



నా పేరు వాకపల్లి కృపామణి. నాది అనపర్తి మండలం కొప్పవరం. మాకు ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ అవసరం కావడంతో వలంటీర్‌కు సమాచారం ఇచ్చాం. దీంతో వలంటీర్ మా ఇంటికి వచ్చి దరఖాస్తు పూర్తి చేసి సచివాలయంలో అందజేశారు. దరఖాస్తు చేసుకున్న కేవలం వారం రోజుల్లో సర్టిఫికెట్ మంజూరైంది. సర్టిఫికెట్ కోసం ఏ ఒక్కరికీ ఒక్క రూపాయి కూడా మామూలు ఇవ్వలేదు. గ్రామ సచివాలయం ఏర్పాటుతో ఏవిధమైన వ్యయ ప్రయాసలు లేకుండా సమస్యలు పరిష్కారం కావడం సంతృప్తినిస్తోంది.

–వాకపల్లి కృపామణి, కొప్పవరం

రెండు గంటల వ్యవధిలోనే...



నా పేరు కొవ్వూరి రామారెడ్డి. గత ఏడాది నవంబర్ 30న మధ్యాహ్నం సదరం సర్టిఫికెట్ వచ్చింది. దివ్యాంగ పింఛను కోసం దరఖాస్తు చేసుకున్నాను. అయితే దానికి కుల, ఆదాయ ధృవీకరణ పత్రాలు అవసరమని, వాటిని ఈ రోజు సాయంత్రంలోగా దరఖాస్తు చేసుకుంటే జనవరి నెలలోనే కొత్త పింఛన్లు వస్తాయని సచివాలయ సిబ్బంది తెలిపారు. అయితే ఆయా సర్టిఫికెట్లు నా వద్ద సిద్ధంగా లేకపోవడంతో వలంటీర్‌ను సంప్రదించాను. దీంతో వలంటీర్ తక్షణం స్పందించి సంబంధిత జిరాక్సులు జతచేసి కుల, ఆదాయ సర్టిఫికెట్లు కోసం దరఖాస్తు చేశాడు. తిరిగి రెండు గంటల వ్యవధిలోనే ధృవీకరణ పత్రాలు వచ్చాయని ఇంటికి తెచ్చి ఇచ్చాడు. వెంటనే ఆ పత్రాలకు సదరం సర్టిఫికెట్ జత చేసి పింఛనుకు దరఖాస్తు చేయడంతో జనవరి 1 నుండి ఠంఛనుగా నాకు పింఛన్ అందుతోంది. గతంలో ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరిగినా ధృవపత్రాలు మంజూరు కావడం లేదంటూ లబోదిబోమన్న వాళ్లని ఎంతో మందిని చూశా. కానీ ఇంటి నుంచి కదలకుండా, పైసా లంచం ఇవ్వకుండా కేవలం రెండు గంటల వ్యవధిలోనే సర్టిఫికెట్ పొందడం జగన్ మార్క్ పాలనలోనే చూశా.

–కొవ్వూరి రామారెడ్డి, కొప్పవరం

క్లుప్తంగా

20న క్రీడా పాఠశాలల్లో ప్రవేశాలకు విద్యార్థుల ఎంపికలు

పెదపూడి: మండల కేంద్రమైన పెదపూడి గాంధీ మెమోరియల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఈ నెల 20న క్రీడా పాఠశాలలో ప్రవేశాలకు విద్యార్థులను ఎంపిక చేయనున్నారని ఎంపీడీఓ పి.విజయభాస్కర్ తెలిపారు. ఆయన శుక్రవారం మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ ఆదేశాలపై వైఎస్సార్ కడప క్రీడా పాఠశాలలో 4,5 తరగతుల్లో ప్రవేశాలకు ఈ విద్యార్థుల ఎంపికలు నిర్వహించనున్నారన్నారు. కలెక్టర్ ఆదేశాలపై జిల్లాలో గల 21 మండల కేంద్రాల్లో ఎంపీడీఓల పర్యవేక్షణలో మండల స్థాయి ఎంపికలు నిర్వహించాలన్నారు. బాలురు, బాలికల విభాగాల్లో ఎంపికలు జరుగుతాయన్నారు. నాల్గో తరగతిలో ప్రవేశాలకు సంబంధించి 1వ తేదీ ఆగస్టు 2014 నుంచి 31వ తేది జూలై 2015 మధ్యలో జన్మించినవారై ఉండాలన్నారు. ఐదో తరగతిలో ప్రవేశాలకు సంబంధించి 1వ తేది ఆగస్టు 2013 నుంచి 31వ తేదీ జూలై 2014 మధ్యలో జన్మించినవారై ఉండాలన్నారు. వివరాలకు 8919642248 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

వైఎస్సార్ సీపీలోకి దొడ్డా విజయ్



గోకవరం: టీడీపీ సీనియర్ నాయకుడు, ఆ పార్టీ మాజీ మండలాధ్యక్షుడు దొడ్డా విజయ్ వైఎస్సార్ సీపీలోకి చేరనున్నట్టు ప్రకటించారు. ఇటీవల టీడీపీకి రాజీనామా చేస్తున్నట్టు ప్రకటించిన ఆయన తాజాగా ఈ నిర్ణయాన్ని వెల్లడించారు. గోకవరం ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఆయన మీడియా సమావేశం నిర్వహించారు. ఇటీవల తాను స్వచ్ఛందంగా ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబును కలిసి తన నిర్ణయం వెల్లడించగా ఆయన స్వాగతించారన్నారు. ఎటువంటి పదవులను ఆశిస్తూ తాను వైఎస్సార్ సీపీలోకి చేరడం లేదని స్పష్టం చేశారు.

మహిళలకు ఉచిత కుట్టు శిక్షణ



ఉచిత కుట్టు శిక్షణను ప్రారంభిస్తున్న జార్జి

రంగంపేట: మహిళలకు ఉచితంగా కుట్టు శిక్షణ ఇస్తున్నట్టు జీఏఎంసీ స్వచ్ఛంధ సంస్థ డైరెక్టర్ ఎస్.చక్రవర్తి తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ మండలంలోని వడిశలేరు గ్రామంలోని అరుంధతీ పేటలో జీఏఎంసీ ఆధ్వర్యంలో ఈ కుట్టు శిక్షణ ఏర్పాటు చేశామని, ఈ కుట్టు శిక్షణ కార్యక్రమాన్ని ఇండియన్ క్రిస్టియన్ ఫెడరేషన్ నేషనల్ ప్రెసిడెంట్ శ్రీమంతుల జార్జి ప్రారంభించినట్టు తెలిపారు. 25 మంది నిరుపేద మహిళలకు అనుభవజ్ఞులైన శిక్షకులతో కుట్టు శిక్షణ ఇచ్చి, సంస్థ తరఫున మెషీన్లు, సర్టిఫికెట్లు అందిస్తామన్నారు. ఎస్. దెబోరా, ఎన్. ప్రసాద్, కోట సుబ్బలక్ష్మి పాల్గొన్నారు.

21న ఆచార్య టేకి మెమోరియల్ లెక్చర్



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న వీసీ ఆచార్య పద్మరాజు

రాజానగరం: ఆదికవి నన్నయ యూనివర్సిటీలో ఈ నెల 21న ప్రొఫెసర్ ఎస్.టేకి మెమోరియల్ లెక్చర్ డిజైన్ థింకింగ్ ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్‌ను నిర్వహించనున్నామని వీసీ ఆచార్య కె.పద్మరాజు తెలిపారు. ఏపీ ఉన్నత విద్యా ప్రణాళిక బోర్డు ఇంటర్ – ఇన్‌స్టిట్యూషనల్ రీజినల్ క్లస్టర్ ఆఫ్ గోదావరి డిస్ట్రిక్స్ సహకారంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. దీనిలో రీసోర్స్ పర్సన్లుగా మాజీ ఐఎంఈ బెంగళూర్ రీసెర్చ్ డీన్ ప్రొఫెసర్ ఎంకె భట్టా పాల్గొని డిజైన్ థింకింగ్‌పై ఉపన్యసిస్తారన్నారు. ఇందుకు సంబంధించిన బ్రోచర్‌ను ఆవిష్కరించారు.

జగనన్న సురక్షపై శిక్షణ

బిక్కవోలు: మండలంలోని సచివాలయాల్లో రెండు రోజుల పాటు జగనన్న సురక్షపై సచివాలయ సిబ్బంది, వలంటీర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో జేఏ ఝాన్సీ తెలిపారు. శుక్రవారం ఆమె మాట్లాడుతూ బిక్కవోలు 3, 4, బలభద్రపురం 3, కాపవరం సచివాలయంలో ఈ నెల 19న నిర్వహిస్తామన్నారు. మిగిలిన సచివాలయంలో శనివారం శిక్షణ కార్యక్రమం ఉంటుందన్నారు.

రేపు వైద్యశిబిరం

సీతానగరం: ఉండేశ్వరపురం సచివాలయంలో ఆదివారం వైద్యశిబిరం నిర్వహిస్తున్నామని సర్పంచ్ మాకాల ఈశ్వరరావు తెలిపారు. రాజమహేంద్రవరం ప్రకాశంనగర్‌లోని వేద స్పైన్ సెంటర్ డాక్టర్ తేజో ఫణీంద్ర వెన్నెముక, ఎముకలకు సంబంధించిన సమస్యలకు ఉచితంగా మందులకు ఇస్తారన్నారు.

నిందితుడి అరెస్టు

రాజానగరం: స్థానిక జంగాలకాలనీలో ఆరేళ్ల బాలికపై అత్యాచారానికి పాల్పడిన షేక్ మీరావలీని అరెస్టు చేసి, రిమాండ్‌కు పంపించామని సీఐ కాశీవిశ్వనాథ్ తెలిపారు. గురువారం ఇంటి వద్ద ఆడుకుంటున్న బాలికను అన్నం పెడతానని ఇంటిలోకి తీసుకువెళ్లి అత్యాచారానికి ఒడిగట్టిన సంగతి విదితమే. నిందితుడిపై పోక్సో కేసు నమోదు చేశామన్నారు.

రెండు గ్రామాల్లో ఫ్యామిలీ డాక్టర్ సేవలు



నల్లమిల్లిలో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ నాగ శ్రీవిద్య

రంగంపేట: ఫ్యామిలీ డాక్టర్ సేవలు ప్రజలందరూ వినియోగించుకోవాలని రంగంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి ఎ.అనూష కోరారు. వడిశలేరు గ్రామంలో శుక్రవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు రోగులకు, గర్భిణులకు, చిన్నారులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. అనంతరం అంగన్‌వాడీ సెంటర్‌ను సందర్శించి చిన్నారులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. సింగంపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో నల్లమిల్లి గ్రామంలో స్థానిక మండల పరిషత్ పాఠశాల్లో నిర్వహించిన ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో సింగంపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి పి.నాగ శ్రీవిద్య పాల్గొని పలువురు రోగులకు వైద్య సేవలు అందించి మందులు పంపిణీ చేశారు. అనంతరం గ్రామంలో నడవలేని, మంచాన పడ్డ రోగుల వద్దకు వెళ్లి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందించారు. ఏఎన్‌ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశాలు పాల్గొన్నారు.

కల్వర్ట్ పనులను పరిశీలించిన ఎమ్మెల్యే



కల్వర్ట్ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి

అనపర్తి: రాజానగరం–పెదపర్తి రహదారిలో మండలంలోని రామవరం గ్రామ పరిధిలో ఆర్‌అండ్‌బీ నిధులు రూ.20 లక్షలతో నిర్మించిన కల్వర్ట్ పనులను ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి శుక్రవారం పరిశీలించారు. అతి తక్కువ కాలంలో కల్వర్ట్ నిర్మాణాన్ని పూర్తి చేసిన కాంట్రాక్టర్, దీనికి సహకరించిన స్థానిక ప్రజాప్రతినిధులు, ఆర్‌అండ్‌బీ అధికారులను ఎమ్మెల్యే అభినందించారు. అనపర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి, పార్టీ నాయకులు కర్రి గాంధీరెడ్డి, టేకి బాబూరావు, కోనాల సత్యనారాయణరెడ్డి ఎమ్మెల్యే వెంట పాల్గొన్నారు.

వలంటీర్లకు సన్మానం

సీతానగరం: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజలకు అందిస్తున్న వలంటీర్ల సేవలు అభినందనీయమని ఎంపీపీ గుర్రాల జ్యోత్స్న అన్నారు. శుక్రవారం ముగ్గళ్ల సచివాలయంలో గ్రామ వలంటీర్లను సన్మానించారు. పార్టీ మండల కో కన్వీనర్ కరుటూరి శ్రీహరిబాబు, విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ సభ్యులు సాదె చంటిబాబు, సుంకవల్లి సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా 17 మంది వలంటీర్లను ఘనంగా సన్మానించారు. కోటేశ్వరరావు, స్వామి, కానూరి రాముడు పాల్గొన్నారు.

నేడు విద్యార్థులకు పురస్కారాలు

మధురపూడి: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతూ ప్రతిభను కనబర్చిన విద్యార్థులకు శనివారం జగనన్న ఆణిముత్యాలు పేరిట పురస్కారాలు అందజేయనున్నట్టు ఎంఈఓ కుశలవ దొర తెలిపారు. ఇందుకు మండలంలోని 14 హైస్కూళ్లకు చెందిన 45 మంది విద్యార్థులను ఎంపిక చేశామన్నారు. మండలంలోని అన్ని హైస్కూళ్లలోనూ ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. ప్రథమ బహుమతిగా రూ.3 వేలు, ద్వితీయ బహుమతిగా రూ.2 వేలు, తృతీయ బహుమతిగా రూ.వెయ్యి అందజేస్తామన్నారు.

మూడు పశువుల పాకలు దగ్ధం

రంగంపేట: రంగంపేట మండలం బాలవరం గ్రామంలో శుక్రవారం జరిగిన అగ్ని ప్రమాదంలో మూడు పశువుల పాకలు దగ్ధం అయ్యాయి. ఈ ప్రమాదంపై గ్రామ వీఆర్‌ఓ పోచయ్య తెలిపిన వివరాల ప్రకారం బాలవరం గ్రామ శివారు పొలాల్లో కొందరు చెత్త తగులబెట్టడంతో ఆ మంటలు దగ్గరలోని చెట్టుకు వ్యాపించి చెట్టు అంటుకుని దాని నిప్పు రవ్వలు అక్కడే ఉన్న పశువుల పాకలపై పడటంతో గ్రామానికి చెందిన నూకపెయ్యి లాజరు, కొత్తపల్లి సత్యనారాయణకు చెందిన మూడు పశువుల పాకలు పూర్తిగా దగ్ధం అయ్యాయి. మంటలు అంటుకున్న పాకలులో పశువులు లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. ప్రమాదంలో లాజరుకు రూ.50 వేలు, సత్యనారాయణకు రూ.75 వేలు మొత్తం రూ.1.25 లక్షల ఆస్తి నష్టం జరిగినట్టు అంచనా వేశామన్నారు. అనపర్తి అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలు ఇతర ప్రాంతాలకు వ్యాపించకుండా అదుపు చేశారు.

డాక్టర్ రామకృష్ణకు సత్కారం



సత్కారం అందుకుంటున్న డాక్టర్ రామకృష్ణ

రాజానగరం: మండలంలోని నరేంద్రపురానికి చెందిన పురోహితుడు, సిద్ధాంతి డాక్టర్ దీక్షితులు రామకృష్ణకు 'ఉపన్యాస విశారద' బిరుదుతో సత్కారం లభించింది. కాకినాడలోని చల్లా జగన్నాథశాస్త్రి ఫంక్షన్ హాలులో హైదరాబాద్‌కి చెందిన పరాశర అకాడమీ ఆఫ్ ఆస్ట్రో సైన్స్ సంస్థ నిర్వహించిన కార్యక్రమంలో ఈ సత్కారం దక్కింది. డాక్టర్ రామకృష్ణను జ్ఞాపిక, ప్రశంసా పత్రాలను అందజేసి పట్టువస్త్రాలతో సత్కరించారు. ఆయన జ్యోతిష, వాస్తు శాస్త్రాలలో పీహెచ్‌డీలతో పాటు ఏడు ఎంఏలు, యోగాలో పీజీ డిప్లమో చేశారు.

విద్యాభివృద్ధికి జగనన్న పెద్దపీట



ఎల్ఎన్‌పురంలో పాఠశాలలో విద్యార్థికి మెడల్, నగదు, సర్టిఫికెట్ అందజేస్తున్న దృశ్యం



సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ నేత సుంకర వీరబాబు



ఊలపల్లిలో విద్యార్థిని, తండ్రిని సత్కరిస్తున్న ప్రజాప్రతినిధులు

పెదపూడి: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి విద్యాభివృద్ధికి పెద్దపీట వేసి అనేక పథకాలు అమలు చేస్తున్నారని ఎంపీపీ కేతా తులసి అన్నారు. జగనన్న ఆణిముత్యాలు పథకంలో భాగంగా మండలంలోని 14 ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో శుక్రవారం పదో తరగతి పరీక్ష ఫలితాల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించిన విద్యార్థులకు గోల్డ్, సిల్వర్, బ్రోంజ్ మెడల్స్, నగదు, సర్టిఫికెట్ అందజేశారు. ఈ సందర్భంగా జి.మామిడాడ జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల్లో జరిగిన కార్యక్రమంలో ఎంపీపీ తులసి మాట్లాడుతూ సంపూర్ణ అక్షరాస్యతతోనే సర్వతోముఖాభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. గ్రామ శివారు ఎల్ఎన్ పురం పాఠశాలలో ఎంపీటీసీ సభ్యురాలు కర్రి వెంకట పద్మావతి, ఉప సర్పంచ్ మేడపాటి తాతారెడ్డి విద్యార్థులకు మెడల్స్, నగదు, సర్టిఫికెట్ అందజేశారు. కరకుదురు గ్రామంలో హితకారిణి సమాజం డైరెక్టర్ వుండ్రు సత్యనారాయణ విద్యార్థులకు వీటిని అందజేశారు.

అధిక ప్రాధాన్యం

గోకవరం: రాష్ట్ర ప్రభుత్వం విద్యా రంగానికి అధిక ప్రాధాన్యం ఇస్తోందని వైఎస్సార్ సీపీ నాయకుడు సుంకర వీరబాబు అన్నారు. మండలంలోని భూపతిపాలెం గురుకుల పాఠశాలలో శుక్రవారం జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమం నిర్వహించారు. పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలు, నగదు అందజేశారు. పాఠశాలకు చెందిన పడాల మహేంద్ర, బర్రే సూర్యచక్రప్రవీణ్, కోడినాగుల వీరవెంకట అప్పారావు మొదటి మూడు స్థానాల్లో నిలవగా ప్రభుత్వం నుంచి రూ.10 వేలు నగదు పురస్కారం లభించింది. వీరిలో పడాల మహేంద్ర 581 మార్కులతో మండల ప్రథమ స్థానంతో పాటు నియోజకవర్గ స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచి రూ.50 వేలు నగదు పురస్కారం అందుకున్నాడు. ప్రిన్సిపల్ బి.రవి, పాఠశాల పీఎంసీ చైర్మన్ గన్నయ పాల్గొన్నారు. మల్లవరం జెడ్పీ హైస్కూల్‌లో మొదటి మూడు స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు నగదు పురస్కారం అందించి సత్కరించారు.

ఊలపల్లిలో..

బిక్కవోలు: మండలంలోని ఊలపల్లిలోని శ్రీ ముల్లంగి బుల్లి వీరన్న జెడ్పీ ఉన్నత పాఠశాలలో జగనన్న అణిముత్యాలు కార్యక్రమం నిర్వహించారు. పదోతరగతి ఫలితాల్లో పాఠశాల స్థాయిలో మొదటి మూడు స్థానాలు సాధించిన విద్యార్థులకు జగనన్న ఆణిముత్యాలు పథకంలో భాగంగా నగదు పురస్కారాలను విజేతలకు అందజేసి, వారి తల్లిదండ్రులతో కలిపి వారిని ఘనంగా స్థానిక నాయకులు సత్కరించారు. ప్రథమ స్థానం సాధించిన మాకిరెడ్డి బాలకృష్ణకు రూ.మూడు వేలు, రెండవ స్థానం పొందిన బొడ్డు శ్రీ మణికంఠకు రూ.రెండు వేలు, మూడువ స్థానంలో నిలిచిన అల్లు వినాయక లక్ష్మీలోవకు రూ.వెయ్యి అందించారు. సర్పంచి బందారు రమ్య, వైస్ ఎంపీపీ పెంకే మంగయ్యమ్మ, పేరెంట్స్ కమిటీ చైర్మన్ భోకం లోవకుమారి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పోతుల ప్రసాద్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ అధ్యక్షుడు రొంగల అప్పాజి, పాఠశాల హెచ్‌ఎం కొవ్వూరి అమ్మిరెడ్డి పాల్గొన్నారు.

జక్కంపూడి విగ్రహం ధ్వంసంపై నిరసన

- ఇనుగంటివారిపేటలో ఘటన
- పరిశీలించిన జక్కంపూడి గణేష్



ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న జక్కంపూడి గణేష్



ఇనుగంటివారిపేటలో నిరసన తెలుపుతున్న వైఎస్సార్ సీపీ నాయకులు

సీతానగరం: విగ్రహాలను ధ్వంసం చేయడం దారుణమని, ఇటువంటి చర్యలకు పాల్పడిన వారిపై పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలని ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జి జక్కంపూడి గణేష్ అన్నారు. ఇనుగంటివారిపేటలో దివంగత నేత జక్కంపూడి రామ్మోహనరావు విగ్రహాన్ని శుక్రవారం తెల్లవారుజామున గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. రోడ్డు విస్తరణ పనుల నేపథ్యంలో మూడు విగ్రహాలను భద్రపర్చగా, వాటిలో జక్కంపూడి రామ్మోహనరావు విగ్రహాన్ని ధ్వంసం చేశారు. దీంతో సర్పంచ్ సత్యం రాంపండు, వైస్ ఎంపీపీ 2 సత్య మదన్‌బాబు, విజిలెన్స్, మానిటరింగ్ సభ్యులు సాదె చంటిబాబు, మద్దాల కొండలరావు తదితర వైఎస్సార్ సీపీ నాయకులు రాజమహేంద్రవరం – సీతానగరం రోడ్డుపై శాంతియుతంగా నిరసన తెలిపారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని, క్లూస్ టీమ్, డాగ్స్ స్క్వాడ్‌తో ఆధారాల కోసం గాలింపు చర్యలు చేపట్టారు. సమాచారం అందుకున్న జక్కంపూడి గణేష్ సంఘటన స్థలాన్ని పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ పేద, బడుగు, బలహీన వర్గాల ప్రజల కోసం జక్కంపూడి రామ్మోహనరావు ఎనలేని సేవలు అందించి, వారి గుండెల్లో చిరస్థాయిగా నిలిచారన్నారు. విగ్రహాల ధ్వంసం వల్ల ఆ మహనీయుని చరిష్మా ఏమాత్రం తగ్గదన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ గుర్రాల జ్యోత్స్న, పార్టీ నాయకులు పెందుర్తి వెంకటకృష్ణ, ఇబ్రహీం పాల్గొన్నారు.

పేద విద్యార్థుల చదువుకు భరోసా



విద్యార్థులకు జగనన్న విద్యాకానుక కిట్లు అందిస్తున్న సర్పంచ్ లక్ష్మీదుర్గ తదితరులు

రంగంపేట: పేద విద్యార్థుల చదువులకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలోని రాష్ట్ర ప్రభుత్వం ఇస్తున్న భరోసా అనితర సాధ్యమైనదని గ్రామ సర్పంచ్ గవరసాని లక్ష్మీదుర్గ అన్నారు. శుక్రవారం కోటపాడు మండల ప్రజా పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు చంద్రశేఖర్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. అనంతరం విద్యార్థులకు జగనన్న విద్యా కానుకలను పంపిణీ చేశారు. వైఎస్సార్ సీపీ కన్వీనర్ గవరసాని రాజు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



జగనన్న కిట్స్ అందిస్తున్న సర్పంచ్ వీరభద్రరావు

పేద విద్యార్థుల అభ్యున్నతే జగనన్న ధ్యేయం

బిక్కవోలు: పేద విద్యార్థులు ఉన్నత చదువులు అభ్యసించేలా నాణ్యమైన విద్యను అందించేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యారంగంలో విప్లవాత్మకమైన సంస్కరణలు తెచ్చారని రంగాపురం సర్పంచ్ గండికోటి వీర భద్రరావు అన్నారు. శుక్రవారం రంగాపురం గ్రామంలోని విద్యార్థులు జగనన్న విద్యాకానుక కిట్స్ అందించారు. ఈ కార్యక్రమంలోని పేరెంట్స్ కమిటీ చైర్మన్ గండికోట దాన్యయ్య, వైఎస్సార్ సీపీ నాయకులు గండికోట గోవిందు, కేతా శ్రీను,హెచ్‌ఎం కె.గోపాలకృష్ణ పాల్గొన్నారు.

కుతుకులూరులో అగ్ని ప్రమాదం

రూ.2 లక్షల ఆస్తి నష్టం

అనపర్తి: మండలంలోని కుతుకులూరులో శుక్రవారం సంభవించిన అగ్నిప్రమాదంలో రెండు సెలూన్ షాపులు దగ్ధం కావడంతో రూ.2 లక్షల ఆస్తినష్టం వాటిల్లింది. ఈ ఘటనకు సంబంధించి అనపర్తి అగ్నిమాపక కేంద్రం సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం గ్రామంలో చెరువు వద్ద గల కంపోస్టుకు నిప్పుపెట్టడంతో ఎగసిపడిన నిప్పురవ్వలు పక్కనే ఉన్న సెలూన్‌షాపులపై పడి ఈ ప్రమాదం సంభవించినట్లు చెప్పారు. సమాచారం అందుకున్న వెంటనే సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేసినట్లు అగ్నిమాపక కేంద్రం అధికారి జె.శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఈ ప్రమాదంలో అయినవిల్లి దుర్గాప్రసాద్, చల్లపల్లి సోమేశ్వరరావుకు చెందిన సెలూన్ షాపులు అగ్నికి ఆహుతి కాగా వెంటూరి జానకిరాంబాబుకు చెందిన షాపు పాక్షికంగా దెబ్బతిందని తెలిపారు. ఈ ప్రమాదం కారణంగా రూ. 2 లక్షలు ఆస్తినష్టం వాటిల్లినట్లు తెలిపారు.



బాధితులకు సాయం అందిస్తున్న సర్పంచి గొల్లు హేమతులసి తదితరులు

బాధితులకు రూ.10 వేల సాయం

సర్పంచ్ గొల్లు హేమతులసి సురేష్, గ్రామానికి చెందిన పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు అగ్నిప్రమాద బాధితులను పరామర్శించారు. గ్రామానికి చెందిన మురళి ఫ్రెండ్స్ సర్కిల్ ఆధ్వర్యంలో ఇరువురు బాధితులకు ఒక్కొక్కరికీ రూ.5 వేల చొప్పున తక్షణ సాయంగా అందజేశారు. పార్టీ గ్రామ కమిటీ కన్వీనర్ కొవ్వూరి సత్యనారాయణ రెడ్డి, వ్యవసాయ సలహామండలి చైర్మన్ పడాల శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.